భగవంతుడు కాదు
వ్యాపార ప్రకటన

# "సర్వాంతర్యామి"

మన్నవ గిరిధరరావు

ఉదయం దినచర్యను ఉపక్రమించింది మొదలు రాత్రిపూట దోమ తెర మరుగున నడుము వాల్చేవరకు రక్షక భటుల మోస్తరుగా అడ్వర్టయిజ్‌మెంట్లు వెంటపడుతూనే వుంటాయి కిటికీలోగుండా వచ్చే సూర్య కిరణాల సూదులబాధ భరించలేక పక్కమీదనుంచి లేచేసరికి "జెనిత్ బ్లేడుతో సుస్నిగ్ధమైన క్షవరము పొందుడు" అని క్యాలండర్‌మీది ప్రకటనచూచి వెంటనే తత్సంబంధమైన సరంజామా అంతాతీసుకొని గడ్డం గీకడం ఆరంభించాననుకోండి గడ్డంమీద అక్కడక్కడ గాట్లుపడ్డవిషయం మీకు చెప్పకుండా దాచటం అంత మంచిదికాదు, ఎందువల్లనంటారా? అప్పుడే తయారయిన ప్లాంటర్సు కాఫీ చప్పరిస్తూ చప్పరిస్తూ వుండగా కిటికిలోగుండా "ఆంధ్రప్రభ" లోపలికిదూకించబడటం జరిగింది. తాగేతాగే కాఫీ అలా బల్లకు ఆనించి ఛట్టున పత్రికమీదకి దృష్టి సారించాను. "కొరియాలో చైనా దురాక్రమణ జరిపిందని మిత్రరాజ్య సమితి నిర్ణయం" అనేవార్త కంటపడింది ఆ వార్తకు క్రిందనే" అన్ని రకముల గాయములకు, మొటిమలకు సైబాల్ - వజ్రాయుధమువంటిది" అనే ప్రకటన కనబడింది. కొరియాపై చైనా జరిపిన దురాక్రమణకంటె నా గడ్డంమీద జెనిత్ బ్లేడు చేసిన "దౌర్జన్యం" మిక్కుటమనటంవలనన్నా, రక్తం ప్రవహించనున్నట్లుగా చేతిలోని అద్దం "సాక్ష్యం" ఇస్తున్నదిగనుకనున్నా, సైకిలిచ్చి పిల్లవాడిని పంపి "సైబాల్" తెప్పించి గడ్డానికి ప్రయోగించాను. ఆ నిముషంలో జరిగిన నాలుగణాల "క్షవరానికి" కీర్తి ప్రతిష్ఠలు "జెనిత్ బ్లేడు"కే చెందాలనుకోండి.

అసలు ప్రహ్లాదుడు పేరుతో పోతన అన్నాడు లెండి- "ఇందుగలడందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుం డెందెందు వెదకి చూచిన అందందేగలడు."—ఈ మాటలో ఎంత వరకు సత్యమున్నదో కాస్త అంతు తేల్చాలనే ఆసక్తికలవాళ్లు ఈ రోజుల్లో కనిపించరు, కాలం మారిపోయింది. ఆనాటి హిరణ్యకశిపుడిలాగ ఆ సర్వాంతర్యామికోసం అరికాలు కందేటట్లుగా స్తంభాన్ని ఒక్క తన్ను తన్నటం, తీరా విరిగిన చేకు స్తంభంలోనుంచి పళ్ళు జలదరించే ఆకారంతో జూలు విదిలించుకుంటూ సర్వవ్యాపి బయటకు రావటం. ఇలాంటి పరిశోధనలతో కాలాన్ని "దుర్వినియోగం" చేయటంద్వారా ఆ "ఘోషా"లో వుండే దేవుడిని అవతారాలను ఎత్తింప చేస్తూ "కష్టపెట్టటం" నేటి నాగరికప్రజానీకానికి ఇష్టమైన పనికాదు-

ఇంత రహస్యంగా, ఇంత అండర్‌గ్రౌండ్‌గా ఇంత గోప్యంగా వుంటున్నాడని ఊహించబడిన ఆ దేవునికి వున్న బిరుదులూ, బహుమతులూ అన్నీ మూటకట్టి అడ్వర్టయిజ్‌మెంట్లు మెడలో వేస్తే సబబుగా వుంటుంది- ఎందువల్లనంటారా? అదిలేకుండా ఏ పనీ జరుగదు; దానికి తెలియకుండా "చీమ అయినా కుట్టదు." దానిని గౌరవించకుండా, దాని ప్రమేయం లేకుండా, ఏ వ్యాపారమూ సాగదు, ఏ సభాజరుగదు; ఏ సినిమా

ఆడదు, ఏ వ్యక్తి పైకిరాదు; అసలది లేకుంటా ఇపుడు ప్రపంచమేలేదు.

నల్లగొడుగును ఎండకడ్డంపెట్టుకుని ఆఫీసు వైపునడక సాగించాను, వీథిలో తెల్లని గోడలేవీ ''వృధా''గా వదలిపెట్టబడలేదు. చివరకు ఒక పబ్లిక్ పాకీ దొడ్డి సిమెంటు గోడమీద—"దడదా-దడదా- జీవితం - మూడవవారం" అని తాటికాయలంత అక్షరాలు కనిపించాయి. ఎంత పుణ్యం" చేసుకున్నదో ఆ దొడ్డి! "అపూర్వ" నాట్య ప్రదర్శనం - జీవితంలో మోహినియగు - వైజయంతీమాలచే"—ఇందులోవున్న విచిత్రమేమంటే "కిటికీ"లో డదదా పాటకు జీవితంలో నకలు వున్నదనే పురాణగాధనూ వైజయంతీమాల "జీవితం"లో మోహినిపాత్ర ధరించిందనే విశ్వసత్యాన్నీ తెలుసుకోకుండా ఆ ప్రకటనచూస్తే తల పగులకొట్టుకున్నా అసలు విషయం బోధపడదు!

వన్యాసినుంచి సంసారిదాకా దేవుడినుంచి దయ్యందాకా, ఎలెక్షన్‌నుంచి అక్షన్‌దాకా, ప్రకటనలతో నిమిత్తంలేని పదార్థంలేదంటే నమ్మండి. వ్యాజ్యాలలో జయాపజయాలు న్యాయాన్యాయాల మీదకాక ప్లీడరు పనమీద ఆధారపడినట్లు మార్కెట్‌లో వస్తువు అమ్మకం దాని నాణ్యం మీదకాక దానికి జరిగిన అడ్వర్టయిజుమెంటుమీద ఆధారపడివున్నది! "సిరాలేకుండా వ్రాయటానికి సరిక్రొత్తమార్గం'' అని బోర్డురాయించి పెన్సిలు ముక్కలు చూపినాసరే జనం కళ్లుమూసుకుని కొనివేస్తారు! "మంచుగడ్డలేకుండా నీరు చల్లబడడానికి పరికరం" అని చెప్పి మట్టికుండనైనా తెచ్చి పెట్టండి—ఎత్తుకెత్తు డబ్బులిచ్చి ఎగురవేసుకెళతారు. ఇక ఓట్ల హడావుడి సమయంలో చెప్పనక్కరలేదు- గాంధీ భక్తుడనని ఒకరు బాకా వూదుకుంటే, నేతాజీ అనుచరుడనని మరొకరు ప్రకటించుకుని ఓట్లు సంపాదించుకుంటారు- దేశనాయకులపేర్లు స్వంతసొత్తులాగ వాడుకోవడం ఈ రోజులలో పరిపాటి- శివాజీ కుట్టుదారం, నేతాజీ వాషింగ్‌షాప్, బాబూజీ మిలిటరీ రెస్టారెంటు, నెహ్రూ బొగ్గులడిపో, జయలక్ష్మి హెయిర్‌కటింగ్ సెలూన్, ఇట్లా ఎంతమంది మహాత్ములపేర్లు డబ్బుచేసుకోటానికి ఉపకరిస్తున్నాయో లెక్కలేదు!

"డబ్బు సంపాదించేమార్గం తెలుసుకొనుటకు బేడపోస్టు బిళ్ళలతో దరఖాస్తు పెట్టుకొనుడు'' అని ప్రకటించి నాలుగైదువేలదాకా సేకరించుకొని ''ఇలాగే''అని మరొక ప్రకటనచేసిన వాని వినోదగాధ తెనుగునాడులో సువిదితం అమృతసర్‌లో ఇలాంటి పనులు అధికులని డబ్బు పోగొట్టుకున్నవాని స్వానుభవం.

కాలేజీవరండాలో అడుగుపెట్టి గొడుగు ముడిచి చంకనపెట్టుకొని చలవకళ్ళజోడు జేబులోదూర్చి ఇట్లా ఆఫీసులో అడుగుపెట్టుదునుకదా. ఒక దయ్యపు బొమ్మ గోడమీద ప్రత్యక్షమయింది ఒక పెద్ద భూతం నోరుతెరుచుకొని గుడ్లు పెద్దవిచేసి నిలబడివున్నది దాని పక్కనే కొందరు మనుష్యులు "గల్లివర్"లాగ సూదులతో భూతాన్ని పొడుస్తున్నారు. "ఒక అణాతో క్షయవ్యాధి నిర్మూలించుడు" అని వ్రాసివుండటం చూచి ఇదేదో ఆరోగ్యశాఖవారి ప్రకటనల బాపతు అయివుంటుందనుకొని నా పనిలో నేను నిమగ్నుడనయాను.

పట్టణంలో అఖిల భారత మహాసభకాని, అఖిలాంధ్ర మహా సభకాని; తాలూకా మహా సభకాని, జరగాలనుకోండి. అది రాజకీయ సభకాని, విద్యార్థిసభకాని, రైతుసభకాని, మహిళాసభకాని, రిక్షావాలాలసభకాని, చివరకు పశువులసభ అయినా కానివ్వండి సభలో జనం కిటకిటలాడాలంటే ఉన్నదల్లా ఒకటేమార్గం. ఊళ్లో ప్రతిచౌకీదగ్గరా తోరణాలమాదిరిగా బోర్డులు వ్రాసి వేలాడ

తీయడం, సినిమా ప్రచారపు చిన్నకారులో కూచుని వీధుల వెంట తిరుగుతూ రాత్రిపూట మైక్‌లో జరుగబోయే సభనుగూర్చి గాలిమేడలు కట్టడం, మహాసభ ఎలాగూ ఆలశ్యంగా ఆరంభమవటం అలవాటే కనుక వచ్చిన జనం ఈ లోగా ఇంటి ముఖం పట్టకుండా హిందీ సినిమా రికార్డులు (తెనుగువి ఐతే ప్రజానీకం పారిపోవచ్చు!) పెట్టడం - ఎవరువచ్చినా ఎవరు రాకపోయినా పత్రికా విలేఖరులనుమాత్రం యధావిధిగా రావించి, వారికి 'అలక' రాకుండా ప్రత్యేక వసతులు కలిగించి వాళ్ళచేత చాకచక్యంగా మహాసభ రిపోర్టు వ్రాయించటం - ఈ జాగ్రత్తలు తీసుకుంటే అది చివరకు కోడెదూడల సమ్మేళనమైనా సరే దేశమంతటా మారుమోగి పోతుంది!

ఒకడిని 'ప్రజానాయకుడు'గాచేసి ఆకాశానికి ఎత్తాలన్నాలేక "వినాయకుడి"ని చేసి గుడికట్టాలన్నా. కిటుకంతా దినపత్రిక చేతుల్లో వున్నది అంటే అదొక తరహా అడ్వర్టయిజుమెంటు లెండి! వరుసగా నెలరోజులు ఒక ప్రజానాయకుని ఆ చూకీ పత్రికలో రాకపోతే ఆ వ్యక్తికి శని గ్రహదోషం తగిలిందని వేరే చెప్పనవసరంలేదు. ఎప్పటికప్పుడు మాట్లాడతగిన విషయంలేదే అని సందేహించకుండా, ధాన్యసేకరణదగ్గరనుంచి ధనసేకరణదాకా, హరిజన సమస్యనుంచి నీగ్రో సమస్యదాకా, హిందూకోడ్ బిల్లునుంచి జమీందారీబిల్లుదాకా, తన నోటికి తగిలిన వాక్యాలను "స్వకీయ విలేఖరి" (అంటే స్వయం విలేఖరి) ద్వారా దినపత్రికకు పంపాలి, "ప్రజానాయకుని" పత్రికా ప్రకటనలో మడుపులూ, హంసపాదులూ, స్వయం విరుద్ధాలూ వుంటే అచ్చువేసేవాడే కాస్త కవికరంతో సరిదిద్దకపోడనుకోండి! ఈ విధంగా ప్రతిదినం పత్రికల్లో తనకు తాను ప్రకటన పొందని నిర్భాగ్యుడెవరైనవుంటే అతని నాయకత్వం 'సమాధి' దశలోకి వచ్చిందన్నమాటే!

ఎటుతిరిగీ ప్రపంచం ప్రకృతికి దూరమవుతున్న కొద్దీ మనుష్యుల నిజాయితీ నీరసిస్తున్న కొద్దీ పైపై మెరుగులు పెచ్చుపెరుగుతున్న కొద్దీ "సర్వాంతర్యామిత్వం" దేవుడికి "విడాకులిచ్చి" అడ్వర్టయిజ్‌మెంట్ల పాలపడుతున్నది. ఇకమన కానుకలూ, కొబ్బరికాయలూ, ముడుపులూ, దేవునికి తప్పించి ప్రకటనలకు ఇవ్వటం ఆరంభించాలి!

★

బలవంతుని బలాన్ని తగ్గించడంవల్ల బలహీనుని బలవంతుడుగా చెయ్యడం అసాధ్యం

కూలిఇచ్చేవాణ్ణి కిందకు తోయటంవల్ల కూలితీసుకునేవాణ్ణి పైకి తీసుకురావడం అసాధ్యం-

డబ్బుగలవాళ్ళని నిర్మూలంచెయ్యడంవల్ల పేదవాళ్ళని ఉద్ధరించటం అసాధ్యం-

వర్గద్వేషాలని పురికొల్పడంవల్ల మానవసహోదరత్వాన్ని నశింపజేయడం అసాధ్యం-

మానవుడు తనే చేయవలసిన పనులకు ఎల్లప్పుడూ ఒకరిమీద ఆధారపడిఉండడం అసాధ్యం.

—అబ్రహాంలింకన్.